

22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ -2024 మేరకు జిల్లాలో అన్నిరకాల దరఖాస్తులు 4,15,234 అందాయని, క్షేత్రస్థాయి పరిశీలనలో 70,876 తిరస్కరించడం జరిగిందని, 3,43,663 ఆమోదించగా, 695 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ -2024 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో 21 వ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ -2024 ప్రకారం ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన చేపట్టి పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి పురుషోత్తం నాయుడు, టిడిపి మనోహరాచారి, వైఎస్ ఆర్ సిపి చంద్రమౌళి , ఆర్డిఒ లు నిశాంత్ రెడ్డి, చంద్రముని, శివశంకర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామి రెడ్డి , తహశీల్దార్ వెంకటరమణ , సెక్షన్ తహసీల్దార్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరమాల'పల్లి'లో 'విరూపాక్ష'

- •పోలీసులు ప్రేక్షకపాత్ర
- •ఆలస్యంగా వెలుగులోకి..!



క్షుద్ర పూజలకు రూ.18 లక్షలు ఖర్చు!!
ప్రశ్నించిన అంబేద్కరిస్టు గ్రామ బహిష్కరణ


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శాస్త్ర సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతున్న కాలమిది...సాంకేతిక పరిజ్ఞానంతో మృత్యువునే జయించగల్గుతున్న కంప్యూటర్ యుగమిది.. నాగరికత బుల్లెట్ ట్రెయిన్‌లా విస్తరిస్తున్న ఈ కాలంలోనూ దెయ్యాలూ, భూతాలూ, పిశాచాలు లాంటి మూఢ నమ్మకాలు పల్లెల్లో ప్రబలుతుండటం నిజంగా సిగ్గుచేటు. మూఢ నమ్మకాలపై తీసిన విరూపాక్ష లాంటి చిత్రాలను మనం తెరపైన చూశాం. కానీ విరూపాక్ష లాంటి నిజమైన స్టోరీ నిజజీవితంలోనూ చోటు చేసుకుంది. గ్రామంలోకి దెయ్యాలు, భూతాలు, పిశాచాలు, ప్రేతాత్మలు ప్రవేశించకుండా అష్టదిగ్బంధనం చేసేందుకు ఏకంగా రూ.18 లక్షలు ఖర్చు చేసిందీ ఆ గ్రామ పెద్దరికం. దాన్ని ప్రశ్నించిన ఓ అంబేద్కరిస్టును గ్రామ బహిష్కరణ చేయడం విచారకరం. ఈ సంఘటన తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం అముదూరు పంచాయతీ పరమాలపల్లి దళితవాడలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి పోతే..పరమాలపల్లి అటవీప్రాంతానికి దగ్గరగా ఉండే ఓ చిన్న గ్రామం. సుమారు 150 కుటుంబాల దళిత కుటుంబాలువారు నివాసం ఉంటున్నారు. మూడు కార్లు పంటలు పండించుకుంటూ ఆనందంగానే జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల ఆ గ్రామంలోని ఓ మహిళకు దెయ్యాల భయం పట్టుకుంది. తన మానసిక పరిస్థితి అంత బాగోలేకపోవడంతో తన ఇంట్లో దెయ్యం తిష్ట వేసినట్లు నమ్మింది. దాన్ని తరిమికొట్టేందుకు రాయలచెరువు ప్రాంతానికి చెందిన హరి అనే భూత వైద్యుడిని సంప్రదించింది. ఆయన చేత తన ఇంటికి మంత్రాలతో అష్టదిగ్బంధనం చేయించింది. అయినా ఆమె కుటుంబంలో మనశ్శాంతి కరువవడంతో మళ్లీ భూత వైద్యుడిని సంప్రదించింది. దీంతో ఆయన దెయ్యం మీ ఇంట్లోనే కాదు, మీ ఊరి చుట్టూ కూడా ఉన్నాయనీ, గ్రామాన్ని అష్టదిగ్బంధనం చేస్తే కానీ వాటిని తరిమి కొట్టలేమంటూ ఉచిత సలహా ఇచ్చాడు. దీంతో ఆమె భూత వైద్యుడి మాటలు గుడ్డిగా నమ్మి అష్టదిగ్బంధనం చేయించేందుకవసరమైన నిధులను, గ్రామ పెద్దల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేసింది. ఆ మహిళ పొదుపు సంఘంలో ఓ లీడర్‌కూడా కావడంతో తన ఉపాయాన్ని పొదుపు మహిళల నుంచి మొదలు పెట్టింది. గ్రామంలో దెయ్యాలూ, భూతాలు తిరుగుతున్నాయనీ, అష్టదిగ్బంధనం చేస్తే కానీ అవిపోవనీ, దానికి చాలా ఖర్చువతుందంటూ వివరించింది. అది నమ్మిన పొదుపు మహిళలు తాము నెల నెలా చెల్లించే రుణం నుంచి రూ.3 వేలు ఆమె వద్ద చేర్చారు. ఆ గ్రామంలో ఉన్న 16 గ్రూపుల నుంచి సుమారు రూ.8 లక్షల నగదును వసూలు చేసి ఆ భూత వైద్యుడి చేతుల్లో పెట్టారు. అదీ చాలకపోవడంతో గ్రామ పెద్దలను ఒప్పించి గ్రామంలో నిల్వ ఉన్న నగదు రూ.10 లక్షలను కూడా తీసుకెళ్లి భూత వైద్యుడికి అప్పగించారు. ఈ తంతంగమంతా గతేడాది జూలై నుంచి డిసెంబరు వరకు సాగింది. అయితే అదేనెలలో తమ పొదుపు రుణాల డబ్బులు భూత వైద్యుడికి ఖర్చు చేస్తున్న సంగతి తెలుసుకున్న అంబేద్కరిస్టు, ప్రజా గాయకుడు, రచయిత, ఆర్టీసీ ఉద్యోగి అముదూరు.బాలరాజు సంఘమిత్రను గట్టిగా ప్రశ్నించాడు. తనకేమీ తెలియదనీ, గ్రూపులీడర్లు చేస్తున్న నిర్వాహకాన్ని ఆమె బాలరాజుకు విన్నవించింది. దీంతో బాలరాజు తాము క్షుద్రపూజలు చేసేందుకు నగదు చెల్లించబోమని, ఇలా చేయడం తప్పని వారించాడు. అయినా వినకపోవడంతో 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏర్పేడు పోలీసులు గ్రామంలోకి వచ్చి గ్రామస్తులను మందలించి వెళ్లారు. దీనిపై ఆగ్రహించిన పొదుపు మహిళలు, గ్రామ పెద్దలు డిసెంబరు 18న గ్రామంలో పంచాయితీ పెట్టి బాలరాజును నిలదీశారు. నువ్వు చేసింది తప్పనీ, గ్రామ కట్టుబాట్లకు తలొగ్గాలనీ, చేసిన తప్పుకు రూ.లక్ష జరిమానా కట్టాలంటూ హుకుం జారీ చేశారు. లేకుంటే గ్రామ బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. దానికి బాలరాజు ససేమిరా అనడంతో చివరకు బాలరాజును ఆ ఊరి గ్రామ పెద్దలు ఏకంగా ఊరి బహిష్కరణ చేశారు. దీంతో బాలరాజు ఏర్పేడు పోలీసులను ఆశ్రయించాడు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. ప్రస్తుతం బాలరాజు ఊరికి అవతలే తన కుటుంబంతో గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. దెయ్యాలూ, భూతాలు లేవని సమాజం కోడై కూస్తున్న తరుణంలో, మూఢనమ్మకాలు తప్పని హెచ్చరించిన బాలరాజు లాంటి అంబేద్కరిస్టులను ప్రశంసించాల్సిందిపోయి బహిష్కరించడం ఎంతవరకు సబబో ఆలోచించాలి. గ్రామంలో నెలకొన్న మూఢ నమ్మకాలను పారదోలి చైతన్యం వారిలో నింపాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం విచారకరం. ఈ విషయమై ఏర్పేడు పోలీసు అధికారిని వివరణ కోరగా అలాంటిదేమీ లేదని చెప్పడం గమనార్హం.



గ్రామ బహిష్కరణకు గురైన అంబేద్కరిస్టు

సెలవుల్లోనూ 'శిక్ష'ణ..!



ట్యాబ్ల పంపిణీ, వాడకంపై ట్రైనింగ్
వెంటనే విద్యార్థులకు ఇవ్వాలని హుకుం
అంత హడావిడి ఎందుకంటున్న టీచర్లు

ప్రజాశక్తి - తిరుపతి

ఉపాధ్యాయులకు సంక్రాంతి సెలవుల్లోనూ 'శిక్ష'ణ తప్పడం లేదు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ట్యాబ్‌లు, నాడు - నేడు పనులు పూర్తి అంటూ ప్రభుత్వం హడావిడి చేస్తోంది. విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలంటూ హుకుం జారీ చేయడంతో టీచర్లు సంక్రాంతి సెలవుల్లోనూ విధి నిర్వహణలో తలమునకలు అవుతున్నారు. పండగ సెలవుల్లో కుటుంబీకులతో ప్రశాంతంగా గడపడానికి వీల్లేకుండా, మానసిక ప్రశాంతత లేకుండా ప్రభుత్వం విధులు అప్పగిస్తోందని వాపోతున్నారు. అంత హడావిడిగా మండలాలకు ట్యాబ్‌లు ఎందుకు పంపించాలని ప్రశ్నిస్తున్నారు. సెలవులైన తరువాత పంపిణీ చేయొచ్చన్న వాదన టీచర్ల నుంచి వినిపిస్తోంది.

ఇటీవలే ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్లు అందించారు. అయితే పిల్లలకు సరిపడా అప్పట్లో రాలేదు. ప్రస్తుతం ఇండెంట్ మేరకు వచ్చిన ట్యాబ్లు లలో ఇన్స్టలేషన్, కంటెంట్ లోడింగ్ను వెంటనే పూర్తి చేయాలంటూ టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే వాటిని విద్యార్థులకు అందించాలంటే సంబంధిత తరగతి టీచర్లు స్కూలుకు రావాలి. వాటి వినియోగం గురించి పిల్లలకు తెలియజేయడానికి సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండాలి. ఇవన్నీ పండగ సెలవుల్లోనే ఎందుకు పెట్టు కుంటున్నారు? ఉద్దేశపూర్వకంగానే ఉపాధ్యాయుల్ని ఇబ్బంది పెట్టడానికే ఇవి చేస్తున్నారని ఉపాధ్యాయ వర్గం ప్రశ్నిస్తోంది.

అలాగే రెండో విడతలో నాడు-నేడు పనులకు ఎంపి కైన పాఠశాలలకు తాజాగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు పంపారు. వాటిని ఈ సెలవుల్లోనే బిగించాలని ఆదేశాలు వచ్చాయి. వాటి ఏర్పా టుకు అవసరమైన వ్యయాల్ని మాత్రం పంప లేదు. ఉన్న నిధుల నుంచి వెచ్చించుకోవాలని సూచించడం పట్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతుండటం గమనార్హం.

రేపు ట్యాబ్స్ పంపిణీ చేయాలి : డిఇఒ

ఈరోజు డిఇఒ ఆఫీసు నుంచి ట్యాబ్స్‌ను ఎంఇఒలు తీసుకెళ్లారు. రేపు ఎటువంటి పరిస్థితుల్లోనూ పిల్లలకు పంపిణీ చేయాలి. ఇపుడే ఈ విషయాన్ని హెచ్ఎంలకు సమాచారం ఇవ్వండి. రేపే పిల్లల్ని పిలిపించుకుని ట్యాబ్స్ ఇచ్చి, ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేయండి. ఒక్కో మండలానికి కనీసం రూ.1.50 కోట్ల నుంచి 3 కోట్ల విలువ గల ట్యాబ్‌లు ఇచ్చారు. ఎంఆర్‌సిల్లో రాత్రిపూట కనీసం ఇద్దరిని కాపలా పెట్టండి. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఎంఆర్‌సిల్లో, స్కూళ్లలో స్టాక్ ఉండరాదు. చోరీకి గురైతే చాలా సీరియస్ యాక్షన్ ఉంటుంది.

సెలవుల్లో ఒత్తిడి మానుకోవాలి : ముత్యాల రెడ్డి, ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్



'అసలు సెలవుల్లో పనిచెప్పి వేధించడం సబబు కాదు. సంక్రాంతి సెలవుల తరువాతే టాబ్ ల పంపిణీ, ఇన్స్టలేషన్‌ను పూర్తి చేస్తారు. అలాగే నాడు - నేడు పనులు దాదాపు పూర్తయ్యాయి. వీటిపై ఓ కమిటీ పర్యవేక్షణ చేస్తోంది. రాష్ట్ర స్థాయి అధికారుల సూచనల మేరకే జిల్లా, మండల స్థాయి అధికారులు వ్యవహరించాలి. అలా కాకుండా సెలవుల్లో పనిచేయాలని ఒత్తిడి చేయడం మానుకోవాలి.



పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

రేణిగుంట : కేంద్ర ప్రభుత్వంలో భాగస్తులైన భారత రైల్వే లకు సంబంధించిన కార్మిక సంఘాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నిరసన కొనసాగించారు. విశ్రాంత ఉద్యోగులకు మద్దతుగా రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం నందు సభ్యులందరూ సమావేశమై నిరసన చేపడుతున్న విశ్రాంత ఉద్యోగులకు, కార్మికులకు మద్దతు తెలియజేయాలని తీర్మానం చేశారు. పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని బ్యాడ్జీలు ధరించి కార్మిక సంఘాల పోరాటానికి మద్దతు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ అసన్ సాహెబ్, కార్యదర్శి గుమ్మడి జయంత్ కుమార్, కార్యదర్శి పి కష్ణమ్మ నాయుడు, వైస్ చైర్మన్లు బి రాజేంద్రన్ అప్పారెడ్డి పాల్గొన్నారు.

వాహన రాకపోకలకు ఇబ్బందిగా..
రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు
గ్రామస్తుల మాట ఖాతరు చేయని గుత్తేదారు




అనుపల్లి రోడ్డు మార్గంలో రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రాపురం

అసలే ఆ రహదారి ప్రమాదాలకు నిలయం.. ఎల్లపుడూ మట్టి, గ్రావెల్ తరలిస్తూ వేగంగా వాహనాలు వెళుతుంటాయి. ఈ రోడ్డులో గతంలో ఎన్నో ప్రమాదాలు ఈ వాహనాల వల్ల చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. పదుల సంఖ్యలో మృతులు ఉండగా, పెద్ద సంఖ్యలోనే క్షతగాత్రులు ఉన్నారు. ఇలాంటి ప్రమాదకరమైన రహదారిలో 'నిరంతర' విద్యుత్ పేరుతో స్తంభాలను రోడ్డును ఆనుకుని నాటుతుండటం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఏమాత్రం వాహనాలు వాటిని గుద్దుకున్నా పెద్దఎత్తున ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని గ్రామస్తులు గుత్తేదారును ప్రశ్నిస్తున్నా, లెక్కచేయకుండా తాము 'పెద్దిరెడ్డి' మనుష్యులమని, రోడ్డుపక్కనే స్తంభాలు నాటుతామంటూ బేఖాతర్ చేయడం గమనార్హం.

గంగుడుపల్లి సబ్ స్టేషన్ పరిధిలో బొప్పరాజు పల్లి ఫీడర్ పరిధిలోని బొప్పరాజు పల్లి, అనుపల్లి, నూతుగుంటపల్లి, నెమ్మల్లగుంటపల్లి బీర మాకుల కండ్రిగ గ్రామాలలో ఆర్ అండ్ బి రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలను నాటి విద్యుత్ వైర్లను ఏర్పాటు చేస్తున్నారు. బొప్పరాజు పల్లి నుండి వెదురుకుప్పం వరకు సింగల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు నాటితే భవిష్యత్తులో డబుల్ రోడ్డు వేయాలంటే చాలా కష్టమవుతుంది. ఈ రోడ్డు మార్గంలో నిరంతరం కంకరు, మట్టి, పునాదిరాళ్లు (కాసురాళ్ళు) లోడ్లతో టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లో, కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. కానీ గుత్తేదారు విద్యుత్ శాఖ నిబంధనల మేరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా ఆర్ అండ్ బి రోడ్డుపై ఏర్పాటు చేసి బిల్లులు మంజూరు చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకుండా రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అడిగితే...... 'మీకు దిక్కున్న చోట చెప్పుకోండి....... మేము విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రాపురెడ్డి మనుషులం' అని బెదిరిస్తున్నారని గ్రామస్తుల ఆవేదన. ఆర్ అండ్ బి రోడ్డుపై గుత్తేదారు ఇష్టం వచ్చినట్లు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా ఆర్ అండ్ బి శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు అంటున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కాంట్రాక్ట్ నిబంధన మేరకు విద్యుత్ స్తంభాలను గుత్తేదారు ద్వారా ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలను ఆపివేయాలని యువత కోరుతోంది.

అటు, ఇటు 'సర్దుబాటు'
ఎంపిగా ఆదిమూలం.. ఎంఎల్ఎగా మద్దెల





ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈసారి ఎలాగైనా రాష్ట్రంలో రెండోసారి అధికారం చేజిక్కించుకోవాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. ఎంపిలకన్నా, ఎంఎల్ఎ సీట్లకు ప్రాధాన్యత ఇస్తూ 'గెలుపు గుర్రాలకు' టిక్కెట్లు కేటాయిస్తున్నారు. సత్యవేడు సిట్టింగ్ ఎంఎల్ఎ ఆదిమూలంపై నియోజకవర్గంలో వ్యతిరేకత ఉండడంతో తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తిని ఎంఎల్ఎ అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే ఆదిమూలంను తిరుపతి పార్లమెంట్ స్థానానికి అవకాశం ఇచ్చారు. ఆదిమూలం నిరంతరం జనంలో ఉన్నప్పటికీ పార్టీలోకి వలస వచ్చిన వారికి ప్రాధాన్యత ఇచ్చి, తొలినుంచి పార్టీలో ఉన్న వారిని విస్మరించారన్న అక్కసు ఆ నియోజకవర్గంలో ఉంది. దీంతో ఎప్పటినుంచో రెండు గ్రూపులుగా ఆ నియోజకవర్గంలోని శ్రేణులు విడిపోయి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే జగన్మోహన్‌రెడ్డి తాజాగా జరిపిన సర్వేలోనూ ఆదిమూలం పట్ల వ్యతిరేకత ఉన్నట్లుగా నివేదిక వచ్చినట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో ఆదిమూలం గెలుపు కోసం ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ద్వితీయశ్రేణి నాయకులు బీరేంద్రవర్మకు తొలుత శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డు ఛైర్మన్ ప్రకటించారు. అయితే శ్రీకాళహస్తి నుంచి 'స్థానికత' పేరుతో వ్యతిరేకత రావడంతో ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వయంగా తన అనుయాయులైన అంజూరు శ్రీనివాసులుకు ఇప్పించుకున్నారు. ఎంఎల్ఎ ఆదిమూలం ఈ విషయంలో సిఎం వద్ద గట్టిగా మాట్లాడలేకపోయారన్న బాధ బీరేంద్రవర్మలో ఉంది. అలాగే టిటిడి బోర్డు సభ్యునిగానూ అవకాశం ఇస్తారని చర్చ నడిచింది. తీరా కేటాయింపుల్లో నిరాశే మిగిలింది. దీంతో బీరేంద్రవర్మ గ్రూపు సిఎంను కలిసి ఆదిమూలంకు సీటు ఇస్తే తాము పనిచేయబోమని చెప్పినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఎంఎల్ఎ ఆదిమూలం అయినప్పటికీ ఆయన కొడుకే ఆ పదవిలో చెలాయిస్తూ భూకబ్జాలు, మట్టిమాఫియాతో కోట్లు దండుకున్నారన్న విమర్శలను ఆ కుటుంబం మూటకట్టుకుంది. కాంట్రాక్టుల్లోనూ, శ్రీకాళహస్తి ట్రస్టుబోర్డు, టిటిడి బోర్డు.. ఇలా అన్నింటిలోనూ నిరాశతో ఉన్న బీరేంద్రవర్మ ఈసారి ఎంఎల్ఎ ఆదిమూలం గెలుపుకు ఖర్చు పెట్టడానికి సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఉప ఎన్నికల్లో ఎంపిగా గెలుపొందిన మద్దిల గురుమూర్తిని సత్యవేడు ఎంఎల్ఎ అభ్యర్థిగా ఖరారు చేసి, ఆదిమూలంను ఎంపి అభ్యర్థిగా బదలాయించి దళితుల నుంచి వ్యతిరేకత రాకుండా జగన్మోహన్‌రెడ్డి పావులు కదిపినట్లుగా అనుకోవచ్చు. సిట్టింగ్ ఎంపి మద్దిల గురుమూర్తి అధినేత ఆదేశాలతో ఎంఎల్ఎగా పోటీ చేయడానికి 'ఊ' అన్నట్లే మరి. ఇక సత్యవేడుపై కేంద్రీకరించి రెండుగ్రూపులను 'ఏకం' చేసి ప్రచారానికి తెరలేపాల్సి ఉంది.

నేడు చంద్రబాబు, బాలకృష్ణ, లోకేష్ రాక



ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కొంతమంది బంధువులతో కలిసి సొంత గ్రామమైన నారావారిపల్లెకి శుక్రవారం చేరుకున్నారు. భువనేశ్వరికి స్వాగతం పలుకుతూ భారీ కటౌట్లను తెలుగు తమ్ముళ్లు ఏర్పాటు చేశారు. విద్యానికేతన్ సమీపంలో, నారావారిపల్లి గ్రామంలో స్థానికులు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. శనివారం నారా చంద్రబాబునాయుడు, బాలకృష్ణ, లోకేష్‌లు రానున్నారని చంద్రగిరి మండల పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు తెలిపారు. ఎన్నికల సంవత్సరం కావడంతో ఎక్కువమంది నాయకులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ముందే చేరుకున్న భువనేశ్వరి

15న స్విమ్స్ ఓపి సెలవు

తిరుపతి సిటీ : సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్విమ్స్ ఓపి, ఓటిలకు సోమవారం సెలవుదినంగా ప్రకటించారు. అత్యవసర సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రోగులు ఈ సమాచారాన్ని గుర్తించాలని పేర్కొన్నారు.



తిరుపతిలో..

'మట్టి' తిని బతకాలా..?
వినూత్న నిరసనలతో సమ్మె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

సమ్మె ప్రారంభమై 32 రోజులయ్యింది. జగన్మోహన్‌రెడ్డి నుంచి ఏమాత్రం స్పందన లేదు. ఆయన ఇచ్చిన హామీలనే అమలు చేయమని కోరితే నిర్లక్ష్యంగా ఉన్నారు. సంక్రాంతి పండగ నాటికైనా జీతాలు పెంచండి అంటూ అంగన్‌వాడీలో పళ్లాల్లో మట్టి పోసుకుని తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. తిరుపతి పాత కార్పొరేషన్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగింది. మట్టి తింటున్న అంగన్‌వాడీ మహిళల నిరసనను పాదచారులు ఆసక్తిగా గమనించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలనూ దీక్షా శిబిరంలోనే జరుపుకుంటామని నేతలు స్పష్టం చేశారు. నిర్బంధాలకు తలొగ్గేదే లేదని తేల్చి చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ నాయుడు, జిల్లా కార్యదర్శి ముత్యాలరెడ్డి, నిర్మల, రామచంద్రయ్యల బృందం మద్దతు ప్రకటించింది.

- పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, గొబ్బి పాటలు పాడుతూ, భోగి మంటల్లో ఎస్మా జీవో, షోకాజ్ నోటీసులను దహనం చేశారు. పిచ్చాటూరులోనూ మట్టి తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. వెంకటగిరిలోనూ సమ్మె కొనసాగింది.
- బిఎన్ కండ్రిగలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట డివిజన్ కార్యదర్శి సుదర్శనం ఆధ్వర్యంలో ప్రార్థనలతో నిరసన తెలిపారు.

విధులకు రాకపోతే చర్యలు : సిడిపిఒ

బాలాయపల్లి : అంగన్వాడి కార్యకర్తలు,హెల్పర్లు శనివారం నుంచి విధులకు హాజరు కాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సంక్షేమ శాఖ సిడిపిఓ శంషాద్ బేగం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 72 అంగన్వాడి కార్యాలయాలకు అంగ న్వాడీలు విధులకు హాజరుకావాలని నోటీసులు అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద పిల్లలు పౌష్టికాహారం లేక అల్లాడిపోతున్నారని, విధులకు హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి అంగనవాడి కార్యకర్తకు హెల్పర్లకు నోటీసులను పోస్టు ద్వారా పంపారు.

సమ్మె విచ్ఛిన్నకురాలు హెప్సిబా తొలగింపు



ప్రజాశక్తి - గూడూరు టౌన్

రాష్ట్రంలో లక్షలాది మంది అంగన్వాడీలు న్యాయ పరమైన డిమాండ్ల కోసం పోరాడుతుంటే గత 32 రోజులుగా పోరాడుతుంటే, సమ్మెకు ద్రోహం చేస్తూ విధుల్లో చేరాలని అంగన్వాడిలపై ఒత్తిడి తీసుకు వచ్చిన గూడూరు అంగన్వాడీ యూనియన్ నేత హెప్సిబాను సిఐటియు ప్రాథమిక సభ్యత్వం నుండి, అంగన్వాడి యూనియన్ నుండి తొలగిస్తున్నట్లు గూడూరు సి. ఐ.టి.యు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సి. ఐ.టి.యు కార్యాలయంలో విలేకరుల సమావేశం సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. అంగన్వాడి అధ్యక్షురాలు ఇంద్రవతి , కార్యదర్శి ప్రభావతి, సెక్టార్ లీడర్స్ పెంచలమ్మ, ముని కుమారి , మంగమ్మ , సుబ్బమ్మ, ప్రసన్న , హైమవతి , రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ , సి. ఐ.టి.యు నాయకులు సురేష్ , అడపాల ప్రసాద్, గుఱ్ఱం రమణయ్య పాల్గొన్నారు.

సఫాయి కర్మచారుల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పంచాయతీల్లో గాని, మున్సిపాలిటీల్లో గానీ, మరే ఇతర ప్రాంతాల్లో అయినా మాన్యువల్‌గా మురుగు శుభ్రపరచరాదని, ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి వహా అన్నారు. సఫాయి కర్మచారుల సంక్షేమమే కమిషన్ లక్ష్యమని అన్నారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుపతి కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, అదనపు ఎస్‌పి కులశేఖర్, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్యలతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ వైద్య ఆరోగ్య శాఖ, ఎల్‌డిఎం శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధి నిషేధం, పునరావాస చట్టం 2013 అమలుపై సమీక్షించి పలు సూచనలు చేశారు. మాన్యువల్ స్కావెంజర్లు ఉంటే ఆ వృత్తి నుంచి బయట పడటం కోసం వారికి వన్‌టైం సెటిల్మెంట్‌గా రూ.40వేలు అందజేయాల్సి ఉంటుందన్నారు. వారి కుటుంబంలో పిల్లలకు ఎల్‌కెజి నుంచి పీజీ వరకూ ఉచిత విద్య అందించాలన్నారు. స్కాలర్‌షిప్, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. 18 ఏళ్లు పైబడిన పిల్లలకు ఉపాధి చూపాలన్నారు. తిరుపతి కార్పొరేషన్‌కు సంబంధించి గతంలోచనిపోయిన ఇద్దరు స్కావెంజర్ల కుటుంబాలకు అందించిన సాయం తెలపాలని కోరారు. అధికారులు వివరిస్తూ ఒక్కో కుటుంబానికి పది లక్షల చొప్పున మూడు రోజుల్లో అందించామని, కుటుంబంలో ఒకరికి కార్పొరేషన్‌లో ఉద్యోగం కల్పించామని తెలిపారు. శానిటేషన్ కార్మికులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయాలని, హెపటైటిస్ బి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఆప్కాస్ ద్వారా వేతనాలు వారికి అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. యూనీఫాం, బూట్లు, గ్లౌజ్ ఇస్తున్నామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి మాన్యువల్ స్కావెంజింగ్ లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ అమలును జిల్లాలో 95 శాతం సాధించామన్నారు. జాతీయ కమిషన్ సభ్యులకు శాలువా కప్పి సత్కరించి, తిరుమల శ్రీవారి జ్ఞాపికను అందించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన డా. బి.ఆర్. అంబేద్కర్ సామాజిక సమతా సంకల్పం ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించి సంతకాల సేకరణ ఫ్లెక్సీపై తమ సంతకాలు చేసి రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో 125 అడుగుల విగ్రహ ఏర్పాటు అద్భుత కార్యక్రమం అని కొనియాడారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి అభినందించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఈడి ఎస్సీ కార్పొరేషన్ డా. నరసింహులు పాల్గొన్నారు.

జాతీయ కమిషన్ సభ్యులు పిపి వహా



సఫాయ్ కార్మికులకు మంచి వేతనాలు : పిపి వావ

తిరుమల : ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో సఫాయి కార్మికులకు మంచివేతనాలు అందిస్తుందని నేషనల్ కమిషన్ మెంబర్ పిపి వావ తెలిపారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియా తో మాట్లాడారు. తిరుమలలో చాలా శుభ్రంగా ఉందని ప్రశంసించారు. మోదీ విడుదల చేస్తున్న నిధులను రాష్ట్రం చక్కగా వినియోగిస్తుందన్నారు.

కృష్ణ అభిమానుల అన్నదానం

ప్రజాశక్తి-పాకాల: స్థానిక రామకృష్ణ డీలక్స్ సినిమా థియేటర్ లో మహేష్ బాబు సినిమా 'గుంటూరు కారం' విడుదల సందర్భంగా ఈ పాలగుటపల్లి పంచాయతీకి చెందిన చలం చలపతి చిన్నారి దంపతులు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హేమంత్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి,జితేందర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'మేరిగ' నియామకం అభినందనీయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అందరూ కోరుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను నియోజకవర్గ ఇన్ ఛార్జిగా నియమించడం అభినందనీయమని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు తెలిపారు. గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న నివాసంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. వీరి వెంట స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎఎంసి చైర్ పర్సన్ యమునమ్మ, పార్టీ నాయకులు బోమిడి శ్రీనివాసులు, మురళి, గోపాల్ యాదవ్, ముని, సురేష్ రెడ్డి, హాషిమ్, రమేష్, యోగి పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజలు పెద్దల పండుగను జరుపుకునేందుకు అనువుగా ఉండేందుకు శ్మశాన వాటికవద్ద పరిశుభ్రం చేయించామని, ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకోవాలని స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ కోరారు. గూడూరు పట్టణ సమీపంలోని హిందూ శ్మశాన వాటికవద్ద చేపట్టిన జంగిల్ క్లియరెన్స్ పనులను ఆమె పరిశీలించారు. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలను పురపాలక సిబ్బందితో తొలగించారు. సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోదండ రామయ్య, రాము, పారిశుద్ధ్య కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి- నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చీరాలయకు పుట్టినరోజు సందర్భంగా జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్ దుశ్శాలువతో సన్మానించారు. . వైసిపి మండల కన్వీనర్ ఈ సొరకాయలు, డిసిసిబి డైరెక్టర్ టి ఊరప్ప, ఏరుకుంబట్టు సర్పంచ్ ఏలుమలై శుభాకాంక్షలు తెలిపారు. మండల కన్వీనర్ సొరకాయలు మాట్లాడుతూ రాజకీయంగా ఎన్నో పదవులు పొందాలని దీవించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులు రాణించాలి

ప్రజాశక్తి- రేణిగుంట : రాష్ట్ర స్థాయిలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో గాజులమండ్యం క్రీడాకారులు రాణించాలని ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ గంగారి రమేష్ ఆకాంక్షించారు. గురువారం గాజుల మండ్యం గ్రామపంచాయతీలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో వాలీబాల్ మండల విజేతగా గాజుల మద్యం జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ గంగారి రమేష్‌తో పాటు వైసిపి మండల అధ్యక్షుడు గాజుల మన్యం సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీలు జువ్వల ధనంజయ రెడ్డి, వెంకటరమణారెడ్డి ఆ జట్టుకు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయి రాష్ట్రస్థాయిలో గెలిచి గ్రామం పేరు రాష్ట్రస్థాయిలో నిలబెట్టాలని కోరారు.

బడి సుధా యాదవ్ క్యాలెండర్లు, స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాకాల: గల్లా అరుణకుమారి అనుచరుడు బడి సుధా యాదవ్ మండలంలో తన శ్రేయోభిలాషులు అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బడి సుధా యాదవ్ మాట్లాడుతూ గల్లా అరుణ కుమారి కుటుంబం ఆదేశించిన పార్టీ తరపున 2024 ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానన్నారు. పాకాల మండలంలోని గ్రామ పంచాయతీ పుదిపట్లబైలులో తన శ్రేయోభిలాషులకు, ఆత్మీయులకు నూతన సంవత్సర క్యాలెండర్లు స్వీట్లు పంపిణీ చేశామని తెలిపారు.

వివేకానందుడు ఆదర్శనీయుడు: విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : వివేకానందుడు ఎప్పటికీ యువతకు ఆదర్శనీయుడని, ఆయన అడుగుజాడల్లో యువత నడిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎస్‌వియు ఉపకులపతి ఆచార్య వి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. వివేకానందుని 160 జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో "వివేకానంద కేంద్ర – కన్యాకుమారి", తిరుపతి చాప్టర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసితో పాటు వర్సిటీ ఆర్ట్స్ కళాశాల అధ్యక్షుడు ఆచార్య పద్మనాభం వివేకానందుని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్ర యూనివర్సిటీ సభ్యులు ప్రసన్న కుమార్ రెడ్డి, అనిల్ అంబేద్కర్, తిలక్, డాక్టరు అమరేశ్వరి, గిరిరాజ్, వెంకట కళ్యాణ్, వర్సిటీ పరిశోధకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల పంపిణీ

ప్రజాశక్తి -గూడూరు రూరల్: గూడూరు నియోజవర్గం జనసేన ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మన ఊరు మన ఆట కార్యక్రమం నిర్వహించారు. చిట్టమూరు మండలంలోని చిట్టమూరు, కోగిలి , చిల్లమూరు, పంచాయతీలో స్థానిక మహిళలకు ముగ్గులు పోటీ నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు కేర్ టేకర్ తీగల చంద్ర శేఖర్ సహకారంతో బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీర మహిళ విభాగం రీజనల్ కోఆర్డినేటర్ కోలా విజయలక్ష్మి ,నెల్లూరు జిల్లా ప్రచార కమిటీ సమన్వయకర్త గోను క్రాంతికుమార్ చిట్టమూరు మండలం జనసేన అధ్యక్షులు అక్బర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన జనసేన రవి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం మంగళగిరిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికలలో జనసేన ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచించినట్లు తెలిపారు.

ఆర్‌టిసి బస్టాండ్ షాపులకు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీ తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో షాపులు నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 షాపులకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి గలవారు ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. వివరాలకు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

పులివర్తి నాని ఆరోగ్యం కోసం పూజలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పులివర్తి నాని ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ శుక్రవారం మండలంలోని మిట్టూరు వినాయక స్వామి ఆలయంలో టిడిపి నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి ఆధ్వర్యం లో కమ్మ కండ్రిగ, మిట్టూరు గ్రామస్తులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కండ్రిగ, మిట్టూరు ప్రజలు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేదురుమల్లిని కలిసిన మేరుగ

ప్రజాశక్తి -వెంకటగిరి: గూడూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేరుగ మురళీధర్ శుక్రవారం వెంకటగిరి నేదురుమల్లి బంగ్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్, వైసీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని కృతజ్ఞతా భావంతో కలిశారు.ఆయనతోపాటు గూడూరు వైసీపీ నాయకులు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఏర్పేడు: శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం చిందేపల్లి చారిటబుల్ ట్రస్టు తరుపున క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభం అయింది. ప్రస్తుతం ఈ టోర్నమెంట్లో 40 చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు పాల్గొన్నారు. శుక్రవారం 6టీంలు పోటీ పడ్డాయి. ఇందులో సీతారాంపేట, శ్రీకాళహస్తి, చిందేపల్లి విజయం సాధించగా కాత్రికాయలగుంట దుర్గిపేరి, సీసీ లెవన్స్ ఓటమి పాలయ్యాయి. ఈ కార్యక్రమంలో సిద్దేశ్వర బోర్డ్ మెంబెర్స్ క్రికెట్ యువత పాల్గొన్నారు.

ప్రయాణంలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి: సిఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రైల్వే భద్రత సిఐ ఎం మధుసూదన్ తెలిపారు. తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కే సత్యనారాయణ ఆధ్వర్యంలో భద్రత సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో స్టేషన్ మేనేజర్, అన్ని విభాగాలకు సంబంధించిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్స్, టికెట్ తనిఖీ అధికారులు, రైల్వే భద్రత అధికారులు, రైల్వే పోలీసు వారి సిబ్బంది పాల్గొన్నారు. కె మధుసూదన్, సిఐ రైల్వే భద్రత దళం మాట్లాడుతూ తిరుపతి రైల్వే స్టేషన్లో జరుగుతున్న పునర్నిర్మాణ కార్యక్రమాల దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల భద్రత సౌకర్యం తగిన చర్యలు చేపట్టాలని తదితర అధికారులకు సూచించారు. రైల్వేలో అన్ని విభాగాల సహాయ సహకారాలతోనే ప్రయాణికుల భద్రత సాధ్యమవుతుందని తెలిపారు. టికెట్ లేకుండా రైల్వే పరిసరాలలో చొరబడే దొంగతనాలకు పాల్పడుతున్న అనుమానితులను అరికట్టేందుకు తనిఖీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ విభాగాలకు సంబంధించిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్స్ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత,సౌకర్యాల్లో, రైలు కోచ్ లను, రైలు పట్టాలను ఎల్లప్పుడు మరమ్మతులు చేస్తుండాలన్నారు. సత్యనారాయణ, స్టేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత కోసం అన్ని విభాగాలు కలిసిమెలిసిగా పనిచేయాలన్నారు. రైలు ప్రయాణం ఎంతో సురక్షితమని, సౌకర్యవంతమని , రైల్వే ప్రయాణికులకు భద్రతారీత్యా ఏ విధమైన ఇబ్బందులు రానివ్వకుండా చూసుకోవడానికి తాము కృషి చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న రైల్వే భద్రత సిఐ మధుసూదన్

తిరుమల ఘాట్‌లో వేర్వేరు ప్రమాదాలు

మహిళ మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల డౌన్ ఘాట్ రోడ్డులో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాలలో ఒక యువతి మృతిచెందింది. మరొకరికి గాయాలయ్యాయి. 16వ మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతురాలు దాసరి జ్యోతి (23) గుంటూరు జిల్లా మాచర్ల ఎర్రగడ్డ వాస్తవ్యురాలుగా పోలీసులు గుర్తించారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకొని సంతోషంగా ఇంటికి తిరిగెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తన భార్య జ్యోతి మరణించడంతో భర్త సంతోష్ శోకసంద్రంలో మునిగిపోయారు. ద్విచక్ర వాహనంలో ట్రిబుల్ రైడింగ్ వస్తుండగా 16వ మలుపు వద్ద బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. తీవ్ర గాయాలైన జ్యోతిని స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇక 14వ మలుపు వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకి చెందిన లోకేశ్వరికి కాలు విరిగింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి.


ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు

తిరుమల ఘాట్‌లో డ్రోన్ కలకలం

ప్రజాశక్తి - తిరుమల తిరుమలలో మరోసారి డ్రోన్ కెమెరా ఎగుర వేత కలకలం సృష్టించింది. తిరుమల లోని ఘాట్‌రోడ్డులో 53 వ మలుపు వద్ద అసోం ఆర్మీ కమాండర్ కుటుంబం డ్రోన్ కెమెరాతో పరిసరాలను చిత్రీకరించడం వివాదాస్పదమయ్యింది. విషయం తెలుసుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకుని భక్తులను విచారిస్తున్నారు. తిరుమలలో, పరిసర ప్రాంతాల్లో నో ఫ్లయింగ్ జోన్ ఉండడం వల్ల విమానాలుగాని, డ్రోన్ కెమెరాలను వాడడం నిషేదం. శ్రీవారి ఆలయం పై నుంచి విమానాలు ఎగురడంపై గతంలో పలుమార్లు విమానయాన శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసి విమానాలు అటువైపు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనలో భక్తులు చిత్రీకరించిన వీడియోలను తొలగించి పంపినట్టు సమాచారం.



న్యాయశాస్త్ర విద్యకు సాంకేతికతను అనుసంధానం చేయండి : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని న్యాయశాస్త్ర విభాగంలో ఐదు సంవత్సరాల కోర్సు చదివే విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్వీయూ సెనేట్ హాల్లో ఉపకులపతి ఆచార్య వి శ్రీకాంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయశాస్త్ర విద్యార్థులు న్యాయ నిపుణులుగా మారడానికి ఎంతో కృషి చేయాల్సి వుంటుందని సమకాలీన సమాజాన్ని , మారుతున్న ప్రజా జీవనాన్ని, ప్రపంచీకరణ సవాళ్లను అర్థం చేసుకుని ముందుకు సాగాల్సిన అవసర ముందన్నారు. గడచిన దశాబ్ద కాలంగా డిజిటల్ యుగం ఎన్నో విషయాలను అందిస్తుందని, కృత్రిమ మేధ, ఆటోమిషన్ వంటివి న్యాయవాద వృత్తిని ప్రభావితం చేస్తున్నాయన్నారు. 23 శాతం న్యాయ వాదులు చేసే పనిని టెక్నాలజీ చేస్తుందన్నారు. ఇటీవల అమెరికాలో కృత్రిమ మేధస్సుతో రోబోట్ వాదించిన విషయాన్ని గుర్తు చేశారు. న్యాయ విద్యార్థుల్లో నైతికత వారి వృత్తికి పరిమళాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ వి శేషసాయి, నేటి న్యాయ వ్యవస్థపై ఒత్తిళ్ల, వాటిని అధిగమిస్తున్న తీరు, విద్యార్థులు నిరంతరం గమనించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం, కృష్ణయ్య, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయకపోతే చర్యలు: పీడీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నిర్దేశించిన ఉపాధి పనులు పూర్తిచేయకుంటే చర్యలు తప్పవని పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఉపాధి హామీ పనులపై మండల సామాజిక తనిఖీ తూతూ మంత్రంగా సాగింది. సామాజిక తనిఖీ సమావేశం ఎంపిపి మునివేలమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా డిపీవో భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ మండలంలో 14 పంచాయతీలో ఆరు కోట్ల 27 లక్షల రూపాయలతో 420 పనులు చేపట్టామన్నారు. ప్రతి పంచాయతీలో విఆర్పి లు తనిఖీ వివరాలను వివరించారు. దీంతో ఆయన పనులు సక్రమంగా జరగక పోవడంపై అసంతృప్తి వ్యక్తి చేశారు. సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరిత, ఏపిఎం భార్గవి, సామాజిక తనిఖీ డిపిఆర్‌ఓలు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీలో హర్షం

ప్రజాశక్తి -నారాయణవనం: తిరుపతి వైసిపి ఎంపీ అభ్యర్థిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో వైసిపి నాయకుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇందులో భాగంగానే శుక్రవారం ఉదయం స్థానిక జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు నారాయణవనం మండలం అవణక్షమ్మ ఆలయం వద్ద పూజలు చేసి 108 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గత నాలుగు న్నర సంవత్సరాలుగా చేసిన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు రాజకీయ పదోన్నతి లభించిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆయన భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అయన ధీమా వ్యక్తం చేశారు. సత్యవేడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరుపతి ప్రస్తుత ఎంపీ డాక్టర్ గురుమూర్తిని ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సొరకాయలు , డీసీసీ డిరెక్టర్ ఊరప్ప, కోనేటి బాబు, సర్పంచులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు కోరుకున్నట్లు మద్దెల గురుమూర్తికి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తూ తనగిల్లు వేమాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మన నాయుడు. జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, రవి రెడ్డి, ఉగుమూడి గురునాథం , సాయి నాయుడు, అమరలింగయ్య, ముని కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం..

కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసిపి అధికారంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, కోరిన వెంటనే సీఎం జగన్మోహన్ రెడ్డి నిధులు కేటాయించారని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పేర్కొన్నారు. స్థానిక ఐసిఎస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఆయనతో పాటు స్వచ్ఛ ఆంధ్ర ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్ చక్రవర్తి శుక్రవారం టెంకాయి కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులను మార్కెట్ కమిటీ ప్రతినిధులు, తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి కష్టపడ్డ వ్యక్తి మేరిగ మురళి అని కొనియాడారు. పట్టణంలో మార్కెట్లు, రైతు బజారు, హైవే వంతెన వంటి అభివృద్ధి పనులను తమ హయాంలో చేపట్టామని గుర్తు చేశారు. 80 లక్షల రూపాయల వ్యయంతో చేపల మార్కెట్ పనులు మొదలయ్యాయన్నారు. దేవసేనమ్మ చొరవతో డంపింగ్ యార్డు పనులు జరుగుతున్నాన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ చిరకాల కోరిక మార్కెట్ నిర్మాణం పూర్తయిందని, వంతెన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ పట్టువదలని విక్రమార్కుడిలా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మార్కెట్, రైతు బజారు వంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, మురళి, కోదండ రామయ్య, ఎ.ఎం.సి చైర్మన్ యమునమ్మ, యోగి పాల్గొన్నారు.


కూరగాయల మార్కెట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మార్కెట్‌లోకి కియా నూతన ఉత్పాదన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రముఖ టెక్నాలజీ కార్ల ఉత్పాదక సంస్థ కియా తన నూతన కియా న్యూ సోనేట్. ది వైల్డ్ రీబార్న్ కారును శుక్రవారం చెన్నై-బెంగుళూరు రహదారిలోని హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూమ్ లో ఆవిష్కరించారు. ఈ నూతన ఉత్పాదన ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ న్యూ సోనేట్. ది వైల్డ్ రీబార్న్ కారులో 70 కనెక్టెడ్ ఫీచర్స్ కలిగి ఉందన్నారు. నేటి తరానికి తగ్గట్టుగా ఈ కారు అన్ని విధాలుగా తయారై మార్కెట్లోకి ప్రవేశపెట్టామన్నారు. డీజల్ వర్షన్ లో 8 రంగులలో న్యూ సోనేట్. ది వైల్డ్ రీబార్న్ అందుబాటులో ఉందన్నారు. ఈ కారు ఎక్స్ షోరూం ధర 7.99 లక్షలతో ప్రారంభమవు తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చెరుకు నిరంజన్, సి.భారతి, సి. హోషిమా రెడ్డి, సి.ఆషిష్ రెడ్డి, షోరూం సీనియర్ మేనేజర్ రాజ్ కుమార్, మేనేజర్ సోమనాథ్ లాల్, కస్టమర్లు పాల్గొన్నారు.



కియా కారును విడుదల చేస్తున్న దృశ్యం

ఎమరాల్డ్స్ విజయకేతనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెన్సీ శుక్రవారం విడుదల చేసిన ఫౌండేషన్ ఫలితాల్లో తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి విజయ కేతనం ఎగురవేశారని విద్యాసంస్థల డైరెక్టర్లు ఇ. గిరిధర్, కె. విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాల్లో 400 మార్కులకు పి. నిఖిత్ 360, ఎస్.సౌమ్య 354, ఎస్. దివాకర్ రెడ్డి 354, కె.ద్వారకనాథరెడ్డి 348 ఎస్. అయూబ్ 338, ఎస్. ఆరిఫుల్లా 334, బి. యోగేష్ 330, సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. సిఎంఎ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు 91.67 శాతం ఉత్తీర్ణత సాదించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.


ఫౌండేషన్ ఫలితాల్లో విజయం సాధించిన ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు

జ్యోతిలక్ష్మికి ఉత్తమసేవా పురస్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం ఎస్‌విపురం గ్రామానికి చెందిన నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షు రాలు జ్యోతిలక్ష్మి ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా యూత్ కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వ హించి నందుకు పురస్కారం అందు కున్నట్లు జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు, సంఘ సభ్యులు నాథముని, మురళి, చిట్టెమ్మ హర్షం వ్యక్తం చేశారు.



ఉత్తమ సేవ అవార్డును అందుకుంటున్న జ్యోతిలక్ష్మి

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి పాఠ్య పుస్తకానికి అనుగుణంగా బైజుస్ కంటెంట్ తో ఈ ట్యాబ్‌లను అందించామని విద్యార్థులు జాగ్రత్తగా ఉపయోగించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ కుమార్, 8వతరగతి ఉపాధ్యా యులు గౌరి, ధనంజయ, నళిని, శివప్రసాద్ శ్రీనివాసు లు, సుబ్బారావు, శ్రీహరి, మహాలక్ష్మి, సుజన,, షమ్మా, వాణి బాయి, మార్టిన్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మండలంలోని మిట్టూరులోని చేకూరి నాగమ నాయుడు ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాదూరు బాలయ్య, ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులకు ట్యాబులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'శ్రీరామ'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి అంటే మొదట మనకు గుర్తొచ్చేది భోగిమంటలు, రంగవల్లులు, గాలిపటాలు, పొంగళ్ళు అన్నారు. పోటీ ప్రపంచంలో తెలుగువారి సంప్రదాయ పండుగల నేపథ్యాలను విద్యార్థులు గుర్తుంచుకొని అవలంబించేలా ఉండటానికి ఈ ముందస్తు సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ కళాశాలలో అన్ని స్థాయిల వారు కలసి మెలసి ఈ పండుగలను ముందస్తుగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామ సుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, వివిధ విభాగ అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

21న రజకుల మహా పాదయాత్ర

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని లక్ష్యంతో ఆదివారం తిరుపతిలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నేషనల్ జోబి మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని పోరాడుతూనే ఉన్నామన్నారు. బీసీ సామాజిక వర్గంలో ఉండటం వల్ల రిజర్వేషన్లు కోల్పోయి అన్ని రంగాలలో వెనకబడుతున్నా మన్నారు. తిరుపతి నుండి విజయవాడ వరకు ఈ మహా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక నాయకులు మల్లె మొగ్గల ఉమాపతి, గంధం బాబు, వెంకటముని, యశోద పాల్గొన్నారు.

'టిడిపి హయాంలోనే బీసీల అభివృద్ధి'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టిడిపికి వెన్నుముక బీసీలు అని,వారితోనే పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో 'జయహో బీసీ' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, జ్యోతిరావు పూలే చిత్ర పటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకులు గురువా రెడ్డి, బిల్లు చెంచు రామయ్య, పులిమి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా వుండాలి: ఎంపిడివో

ప్రజాశక్తి -కేవిబిపురం: మధ్యాహ్నం భోజనం రుచికరంగా వుండాలని ఎంపీడీవో రామచంద్రయ్య తెలిపారు. వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. శుక్రవారం వెస్ట్ ఆరే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా ఆయన రుచి చూసి విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభా వంతులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -చిల్లకూరు: చిల్లకూరు మండల పరిధిలోని చెడుమాల గ్రామంలో ప్రత్యేక ప్రతిభావంతులకు శుక్రవారం ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రాజనేని రామానాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ట్రై సైకిల్ పంపిణీ నియోజక వర్గంలోని వివిధ కులాలకు సంబంధించిన ప్రత్యేక ప్రతిభా వంతులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తు న్నామని రాజు నేనే రామానుజన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజినేని శ్రీనివాసరావు నాయుడు పేర్కొన్నారు. సమాజంలోని పేదలై ప్రత్యేక ప్రతిభా వంతు లకు అండగా ఉంటామని, పేద విద్యార్థులకు, పేద నిరుద్యో గులకు రామానాయుడు ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పలు గ్రామాల నుండి రాజకీయ నాయకులు, సంస్కర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కళాకారులు ఆధునికతను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యాంత్రీకరణతో పరుగులు పెడుతున్న ప్రస్తుత సమాజంలో కళాకారులు ఆధునిక పద్ధతులను అలవర్చుకోవాలని చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ యండి డాక్టరు జి. దశరధాచారి పిలుపు నిచ్చారు. శుక్రవారం కొత్తపేటలోని చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, కేంద్ర చేనేత జౌళి శాఖ, హస్తకళల అభివృద్ధి సంస్థ, న్యూఢిల్లీ సౌజన్యంతో 50 మంది కొయ్యబొమ్మల కళాకారులకు ఆధునిక పరికరాలను పంపిణీ చేశారు.

జయపాల్ కు రాష్ట్ర సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణతో, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. రచయిత జయపాల్‌కు ఇందులో చోటు లభించింది.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఆరుగురు స్మగ్లర్ల అరెస్ట్


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ ప్రాంతంలో చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్లలో భాగంగా టాస్క్ ఫోర్సు బృందాలు రెండు వేరు వేరు ప్రాంతాల్లో ఆరుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని, 18 దుంగలతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ డిఎస్పి మురళీధర్ తెలిపారు. శేషాచలం అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్లు పెంచామని, డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం కళ్యాణి డాం నుండి చీకటిగలకోన మీదుగా శ్రీవారి మెట్టు వైపు కూంబింగ్ నిర్వహిస్తుండగా బాకరాపేట రేంజి నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీట్ పరిధిలో కొంతమంది ఎర్రచందనం దుంగలను మోసుకొని వెళుతూ కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టగా వారి వద్ద ఉన్న రాళ్లు, ఆయుధాలతో దాడికి యత్నించారని తెలిపారు. వారిలో తిరువన్నామలై జమున, మత్తూరుకు చెందిన మనీని అదుపులోకి తీసుకున్నా మన్నారు. ఈ ప్రాంతంలో 11 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. టాస్క్ ఫోర్స్ పరిధిలోని రైల్వే కోడూరు ఆర్ఎస్ఐ అలీబాషా బృందం గూడూరు, నాయుడుపేట హైవే బూధానం టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా శుక్రవారం ఉదయం ఒక కారులోని వ్యక్తులు వాహనం వదిలి పారిపోయేందుకు యత్నించాడని టాస్క్ ఫోర్సు బృందం చుట్టుముట్టి కారులో తనిఖీలు చేయగా ఏడు ఎర్రచందనం దుంగలు కనిపించాయన్నారు. ఈ ఘటనలో తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన హరీష్ శక్తి , వేలూరు జిల్లాకు చెందిన సంతోష్ సెట్టు, ప్రభు ముత్తుస్వామి , శరత్ కుమార్ , రామచంద్రన్ లను అరెస్టు చేశామన్నారు. ఈ రెండు కేసుల్లో స్వాధీనం చేసుకున్న దుంగల విలువ రూ.20 లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులను సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఆపరేషన్ లో పాల్గొన్న సిబ్బందికి ఎస్పీ పి శ్రీనివాస్ రివార్డులు ప్రకటించారు.

తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -దొరవారిసత్రం: చెన్నై- కలకత్తా జాతీయ రహదారి సమీపంలోని తల్లంపాడు గ్రామం వద్ద సివిల్ సప్లై అధికారుల తనిఖీలలో శుక్రవారం తమిళనాడు రేషన్ బియ్యాన్ని పటుకున్నారు. సివిల్ సప్లై డిటి ఓబయ్య వారి బృందం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా తమిళనాడు నుండి బొలెరో వాహనంలో 2,550 కిలోల తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సూళ్లూరుపేట ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి వాహన డ్రైవర్ శ్రీకాంత్ ను దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సివిల్ సప్లై డిటి ఓబయ్య తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి -కెవిబిపురం: కెవిబి పురం మండలంలోని పోలీస్ స్టేషన్‌ను పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు వస్తున్నాయని ప్రజలు కోడి పందేలు, పేకాటలు ఆడడం చేయకూడదన్నారు. ఎవరైనా అతిక్రమించి పోలీసులకు పట్టుబడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేక వాహనాలు నడపడం, హెల్మెట్ లేని ప్రయాణాలు, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. ప్రజలు పోలీసులకు సహ కరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ సునీల్ కుమార్, ఏఎస్ఐ లోకనాథం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సిఐ

సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెడుతున్న వైసిపి

- టిటిడి మాజీ సభ్యులు ఓవి రమణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రాష్ట్రంలోని బలిజ, కాపు సామాజిక వర్గాల మధ్య అధికార వైసిపి చిచ్చు పెడుదోందని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు ఓవి రమణ విమర్శించారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని బలిజ కాపుల అభివృద్ధికి వైసిపి చేసిందేమీ లేదన్నారు. బలిజ, కాపుల నుండి విడతీసి వారి మధ్య చిచ్చుపెట్టేందుకు యత్ని స్తోందన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బలిజ, కాపులు టిడిపిలో చేరుతు న్నారన్నారు. బలిజ, కాపు నాయకులందరూ టిడిపికి మద్దతు ఇస్తున్నారని రాబోవు ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందన్నారు.

పంపు సెట్లు పంపిణీ

ప్రజాశక్తి - బాలాయపల్లి : రూ.15 లక్షల 20 వేలుతో 15 మంది లబ్ధిదారులకు వైయస్సార్ జలకళ ద్వారా పంపుసెట్లు పంపిణీ చేశామని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ క్లస్టర్ ఏపీ డి జి వరప్రసాద్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని 15 మంది రైతులకు మొదటి విడత కంప చెట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, మాస్టర్ వెరిఫికేషన్ డిఆర్పి రాఘవేంద్ర, ఉపాధి హామీ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

మార్కెట్‌లోకి ఎంజి ఆస్టర్ కొత్త వాహనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కెశ్విన్ ఆటో మోటార్స్ తిరుపతి, కర్నూలు, అనంతపురం, నెల్లూరులోని తమ బ్రాంచులలో శుక్రవారం సాయంత్రం ఒకే సమయానికి ఎంజి ఆస్టర్ 2024 సరికొత్త వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ వాహన ప్రారంభ ధర రూ.9.98 లక్షలుగా ఉందని షోరూమ్ అధినేత ఆర్. ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎడిఎఎస్–ఎల్2 ఫీచర్లతో పాటు 49 సేఫ్టీ ఫీచర్స్, అతిపెద్ద సన్ రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్లెస్ ఛార్జింగ్ వంటి ఫీచర్లు వున్నాయన్నారు. అలాగే సంక్రాంతి సందర్భంగా ప్రతి ఎంజి వాహనం కొనుగోలుపై గోల్డ్ కాయిన్ తో పాటు రూ.2 లక్షల నగదు తగ్గింపు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ చీఫ్ మేనేజర్ బి. సుబ్రమణ్యం, సందాని బాషా, యుబిఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైమరీ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మండల రూరల్ పారవోలు యువత ప్రైమరీ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఏడాది నూతనంగా టోర్నమెంట్ తో 20 జట్లు టీం లతో ఆహ్లాదకర వాతావరణంలో ఈ క్రీడలో ఏర్పాటు చేశారు. పారవోలు గ్రామ యువత ఆర్గనైజర్ శశి కుమార్ మల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి, సదానంద రెడ్డి, మాజీ ఎంపీటీసీ తోట రామచంద్రయ్య ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటగిరి పట్టణ ఎస్ఐ నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నేడు తొలి రోజు వెంకటగిరి పట్టణ మల్లమ్మ గుడి యువత, నాగయ్య కాలేజీ యువత జట్లు తలపడ్డాయి.